క్లుప్తంగా

రైతు పక్షపాతి ప్రధాని మోదీ



మాట్లాడుతున్న కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: రైతులకు యూరియా కొరత లేకుండా అందించిన ప్రధాని మోదీ రైతు పక్షపాతి అని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని దమ్మాయిగూడెం లో కిసాన్ సమృద్ధి కేంద్రంలో ప్రధాని ప్రసంగాన్ని వర్చువల్ ద్వారా రైతులతో కలిసి వీక్షించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 14వ విడత కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా నిధులు విడుదల చేయాడం ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సీతారాంరెడ్డి, కోరమండల్ కంపెనీ బాధ్యులు ఫణికుమార్, మధుసూదన్‌రావు, అన్నదాత ఆగ్రోస్ జనరల్ మర్చంట్స్ సమృద్ధి కేంద్రం నిర్వాహకులు రమణ, బీజేపీ రాష్ట్ర నాయకులు తక్కెళ్లపల్లి నరేందర్‌రావు, గుండా శ్రీనివాసరెడ్డి, మేక సంతోష్‌రెడ్డి, బొడ్డుపల్లి ప్రసాద్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతికి బీజేపీ నివాళి



నివాళులర్పిస్తున్న బీజేపీ శ్రేణులు

ఖమ్మం మామిళ్లగూడెం: భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 8వ వర్ధంతి సందర్భంగా ఖమ్మం ముస్తఫానగర్‌లోని కలాం కాంస్య విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్‌తో కలసి పరిశోధనలు చేసి భారత ఖ్యాతిని ప్రపంచ దేశాలకు తెలియజేసిన గొప్ప శాస్త్రవేత్త కలాం అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మన్‌కీబాత్ రాష్ట్ర కోఆర్డినేటర్ గెంటేల విద్యాసాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రప్రదీప్, అధికార ప్రతినిధులు రాజేష్, మార్తి వీరభద్రప్రసాద్, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, యాకుబ్‌పాషా, నరేష్, వెంకట్, ఫణికుమారి, నాగమణి, ఖాదర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఈపీ వార్షికోత్సవం



ఎన్‌ఈపీ-2020పై మాట్లాడుతున్న వక్తలు

ఖమ్మం రూరల్: మండలంలోని కరుణగిరి వద్ద నున్న ఖమ్మం కేంద్రీయ విద్యాలయంలో నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ(ఎన్‌ఈపీ-2020) 3వ వార్షికోత్సవ వేడుకను గురువారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ టీఎల్ ప్రసన్నకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రీజినల్ ఆఫీస్ నుంచి కార్యక్రమ ముఖ్య అతిథిగా కే.వీ.బోయినపల్లి, ప్రిన్సిపాల్ ఎస్.చంద్రమౌళి, జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ చంద్రబాబు, హార్వెస్ట్ స్కూల్ కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు పాల్గొని మాట్లాడుతూ.. ఎన్‌ఈపీ-2020 ద్వారా యువతకు నైపుణ్యమైన విద్యను అందిస్తూ దేశ అభ్యున్నతికి అవసరమైన స్కిల్స్ పెరిగేందుకు దోహదపడుతుందన్నారు. అనంతరం పలు అంశాలపై సుదీర్ఘంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

యువత సహాయ చర్యల్లో పాల్గొనాలి

నేలకొండపల్లి: యువత వరద సహాయక చర్యల్లో పాల్గొనాలని ఎస్సై బి.సతీష్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం యువత మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ప్రజాహిత కార్యక్రమాల్లో పాల్గొని ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఎస్సైను కలిసిన వారిలో కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బోయిన వేణు, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు సూరేపల్లి రవి, ఐఎన్‌టీయూసీ నాయకుడు మామిడి కృష్ణ, యువజన కాంగ్రెస్ నాయకులు యాతాకుల శ్రీనాథ్, చిలకల లింగయ్య, కె.బాబు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	బేబి
వినోద	బ్రో
సాయిరాం	బ్రో
ఆదిత్య	బ్రో
శ్రీనివాస	బ్రో
శ్రీనివాస	బ్రో

- ఖమ్మంగాంధీచౌక్

పోటెత్తిన మున్నేరు..

- వరద నీటిలో మునిగిన పలు కాలనీలు
- వందలాది ఇళ్లను చుట్టుముట్టిన వరద నీరు
- పునరావాస కేంద్రాలకు బాధితులు



బట్టల సంచులతో పునరావాసానికి వెళ్తూ..



వెంకటేశ్వరకాలనీలో నీట మునిగిన ఇళ్లు

ఖమ్మంమయూరిసెంటర్/గాంధీచౌక్: మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో మున్నేరు గురువారం ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మున్నేరు పరివాహ ప్రాంతాలైన రామన్నపేట కాలనీ, దానవాయిగూడెం, పద్మావతినగర్, గణేష్‌నగర్, వెంకటేశ్వరనగర్, బొక్కలగడ్డ, మంచికంటి నగర్, కాల్వొడ్డు, మోతీనగర్, పంపింగ్‌వెల్ రోడ్డు, పెద్దతల్లి గుడి వెనుక ప్రాంతం, ప్రకాశ్‌నగర్, ధంసలాపురం కొత్త కాలనీల్లోకి వరద నీరు చేరింది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గంటగంటకు వరద నీరు పెరగడంతో జిల్లా అధికారులు అప్రమత్తమై నిరంతరం సమన్వయం చేస్తూ వరద నీటిలో ఉన్న ప్రజలను బయటకు తీసుకొచ్చే చర్యలు చేపట్టారు. మున్నేరు వరద ఉధృతికి పలు కాలనీలు గురువారం తెల్లవారుజాము నుంచి బాధితులు వరద నీటిలోనే ఉన్నారు. వరద భారీగా పెరగడం, కాల్వలు సక్రమంగా లేకపోవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లోని డ్రెయిన్లలలో నీరు బయటకు పోయే పరిస్థితి లేక ఆయా ప్రాంతాల్లోని లోతట్టు ప్రదేశాల్లోకి నీరు చేరింది.

18 ఏళ్ల తర్వాత వరద దెబ్బ..

మున్నేరు ఉప్పొంగి ప్రవహించడంతో నదీపరీవాహక ప్రాంతమంతా జలమయమై ఇళ్లల్లోని ఫర్నిచర్, నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు నీటిలో మునిగి పాడయ్యాయి. పలుచోట్ల ఇళ్లు దెబ్బతిన్నట్లు సమాచారం. 2005 ఆగస్టులో వచ్చిన వరద ప్రళయం మరలా పద్దెనిమిదేళ్ల తర్వాత వచ్చిందని, అయితే మున్నేరు వాగు వెంట వరద నీరు చేరింది తప్ప అంతగా నష్టం జరగలేదని ప్రజలు చెబుతున్నారు. వరద నీటిలో ఇళ్లు దెబ్బతిన్న వారు, ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు వారిమాటల్లోనే..

సాయం కోసం ఫోన్లు..

మున్నేరుకు వరద ఒక్కసారిగా పెరగడంతో సాయం కోసం పలువురు మీడియాకు, అధికారులకు ఫోన్లు చేశారు. పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్, జలగంనగర్ ప్రాంతాల్లో వరద నీటిలో చిక్కుకున్న వారు ఫోన్లు చేసి తమను రక్షించాలని కోరారు. దీంతో అధికారులు ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బందితో వారిని రక్షించే చర్యలు చేపట్టారు.



నీటిలో చిక్కుకున్న వారిని తెప్పలపై తీసుకొస్తూ..

నీళ్లలోనే గడుపుతున్నాం.



మున్నేరు వరద ఇంట్లోకి చేరింది. వస్తువులన్నీ తడిచిపోతున్నాయి. పునరావాస కేంద్రానికి వెళ్లాలని ప్రభుత్వం చెబుతున్నా.. ఇంటి నుంచి బయటకు వెళ్లలేక నీళ్లలోనే గడుపుతున్నాం.

– అఫీఫా బేగం, ధంసలాపురం, కొత్తకాలనీ

18 ఏళ్ల తర్వాత వరద..



2005 ఆగస్టులో అధిక వర్షాలతో మున్నేరు ప్రమాదస్థాయిలో ప్రవహించింది. ఆ సమయాన మున్నేరు పరీవాహక ప్రాంతంలో గృహాల నిర్మాణం అంతగా లేకపోవడంతో అంతగా ఆస్తి నష్టం జరగలేదు. ఇప్పుడు నష్టం బాగానే ఉంటుంది.

– బజ్జూరి ఇందిర, మాజీ కౌన్సిలర్, మోతీనగర్

బిక్కుబిక్కున ఉండాల్సిందే..



వర్షాకాలం వచ్చిందంటే ఎప్పుడు వరదలు వస్తాయో తెలియక బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోంది. మున్నేరులో వచ్చే వరదలతో నగరంలోని త్రీటౌన్‌లోని జనావాసాలు జలమయమవుతున్నాయి. అంతేకాక మున్నేరు వెంట కరకట్ట వంటి సమగ్ర చర్యలు తీసుకోవాలి.

– మేడబోయిన లింగయ్య, ప్రకాష్‌నగర్

పునరావాసాలకు తరలిస్తున్నాం..



35వ డివిజన్‌లోని మోతీనగర్, శ్మశానవాటిక ప్రాంతం అధిక భాగం మున్నేరు నది పరీవాహక ప్రాంతంలో ఉండడంతో ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నాం. ప్రస్తుతం మోతీనగర్ ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– ఎం.వెంకట్రావు, కార్పొరేటర్, 35వ డివిజన్

రూ. 10 లక్షల మేరకు నష్టం..



బుధవారం రాత్రి పోలీసులు ఇంటికి వచ్చి మున్నేరులో వరద ఉధృతి పెరుగుతున్నందున ఇంటిని ఖాళీ చేయాలని చెప్పారు. కాసేపు ఇంటిపైన వేచి చూడగా ఇంతలోనే వరద పెరిగిపోవడంతో ఎటూ వెళ్లలేకపోయాం. తర్వాత ప్రభుత్వ యంత్రాంగం మరబోటు ద్వారా మమ్మల్ని బయటకు తీసుకొచ్చారు. ఇళ్లంతా మునిగిపోయింది. రూ.10 లక్షల మేరకు నష్టం జరిగింది.

– నామా వీరభద్రం, ఆర్టీసీ ఉద్యోగి, మోతీనగర్

బంధువుల ఇంటికి వెళ్తున్నాం..



మునేరులో వరద ఉధృతికి గురువారం ఉదయం నుంచి ఇంట్లోకి నీరు చేరుతుంది. క్రమంగా వరద పెరిగి ఇంటి నుంచి బయటకు రాలేక ఐదు గంటలకు పైగా నీటిలోనే గడిపాం. వరద నీరు తగ్గకపోగా పెరుగుతుంది. ప్రభుత్వ యంత్రాంగం హెచ్చరికలు చేస్తూనే ఉంది. దీంతో ఇంటిల్లిపాది, ఇంట్లో ఉన్న కుక్కతో సహా బంధువుల ఇంటికి వెళ్తున్నాం.

– ఆమంచి సురేష్ శర్మ, అర్చకులు, మోతీనగర్

సమగ్ర చర్యలు తీసుకోవాలి..



మున్నేరులో వరద ఉధృతితో పరీవాహక ప్రాంతంలో నివసించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నాం. నది పరీవాహక ప్రాంతంపై ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకోవాలి. వరదలు వచ్చినప్పుడు పరీవాహక ప్రాంతంలోని ఇళ్లలోకి వరదనీరు చేరటం.. ప్రజలు ఇబ్బందులు పడటం.. వరదలు తగ్గిన తర్వాత తిరిగి బాధితులు ఇళ్లలోకి చేరటం పరిపాటిగా మారింది.

– ఆవుల శ్రీనివాస్, శ్రీనివాస్‌నగర్

చర్యలు తీసుకుంటున్నాం..



ముంపు ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. ముంపు బాధితులను పునరావాస ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాం. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, మహిళలకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. పునరావాస కేంద్రాల్లో బాధితుల యోగక్షేమాలను పర్యవేక్షిస్తున్నాం.

– కొప్పెర సరిత, కార్పొరేటర్, 29వ డివిజన్

కరకట్ట కావాల్సిందే..

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరుకు వరద నేపథ్యాన ఖమ్మం నగరంలో పరీవాహక ప్రాంత కాలనీలకు కరకట్ట నిర్మించాల్సిన ఆవశ్యకతపై చర్చ జరుగుతోంది. దాదాపు 30 అడుగుల మేర వరద రావడంతో మున్నేరుకు రెండు వైపులా ఖమ్మం నగరంలోని పలు కాలనీలతో పాటు ఖమ్మంరూరల్ మండలం జలగంనగర్, ప్రభాత్‌నగర్, కోట నారాయణపురం గ్రామాలను వరద ముంచెత్తింది. నగరం విస్తరిస్తున్న నేపథ్యాన మున్నేరుకు రెండు వైపులా బఫర్ జోన్‌లో ఆక్రమణలు పెరిగాయి. బఫర్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతి లేకున్నా అధికారుల పట్టింపు లేనంతో పలువురు నిర్మాణాలు చేపడుతూనే ఉన్నారు. మున్నేరుకు వరద వస్తే ఇళ్లు నీట మునుగుతాయని తెలిసి అటు అధికారులు, ఇటు నిర్మాణదారులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుత పరిస్థితి ఎదురైంది. కాల్వలను ఆక్రమించడం, పెద్ద కాల్వలను చిన్న కాల్వలుగా మార్చడంతోనే ఇలా జరిగిందని తెలుస్తోంది. ఇకనైనా భవిష్యత్‌లో మరిన్ని ఇబ్బందులు రాకముందే మున్నేరుకు పరివాహ ప్రాంతంలో కరకట్ట నిర్మించాలని నగర వాసులు కోరుతున్నారు.

జలదిగ్బంధంలో ధంసలాపురంకాలనీ...



జలమయమైన ధంసలాపురం కాలనీ..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 16వ డివిజన్ ధంసలాపురంకాలనీలో మున్నేరు వరదనీటితో జలదిగ్బంధంలో నిలిచింది. గతంలో ఎన్నడూ రాని విధంగా 30 అడుగులపైగా వరద రావడంతో సుమారు వెయ్యి ఇళ్లకు పైగా నీట మునిగినట్లు కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా, 250 పైగా ముంపు బాధిత కుటుంబాలను సమీపంలోని కల్యాణ మండపాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించినట్లు ఆయన తెలిపారు.

మురుగు తొలగింపు..



మురుగు శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్

ఖమ్మంఅర్బన్: వరద నీటికి నగరంలోని 12వ డివిజన్‌లో మురుగు కాల్వలో మురుగు మొత్తం సీసీ రోడ్లపై పేరుకుపోవడంతో గురువారం కార్పొరేటర్ చిరుమావిళ్ల లక్ష్మీనాగేశ్వరరావు శుభ్రం చేయించారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

రఘునాథపాలెం: రానున్న ఎన్నికల్లో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గెలుపే లక్ష్యంగా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు సాగాలని సుడా డైరెక్టర్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అజ్మీరా వీరునాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని రాంక్యతండా పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన బూత్ లెవెల్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి తీసుకెళ్లి విస్తృతం చేయాలని కరపత్రాలను అందించారు.ఈ సమావేశంలో నాయకులు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్జల్, గ్రామ సర్పంచ్ అమ్మాలి, మాజీ సర్పంచ్ నంద, గ్రామ నాయకులు తారచంద్, గుగులోత్ మూర్తి, గ్రామ అధ్యక్షుడు కోటేష్, మండల యూత్ సెక్రటరీ గుగులోత్ శ్రీనివాసరావు, గ్రామ వార్డు మెంబర్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను అందిస్తున్న వీరునాయక్

ముమ్మరంగా మొక్కల పంపిణీ



కోయచలకలో పంపిణీ చేస్తున్న సర్పంచ్

రఘునాథపాలెం: తొమ్మిదో విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. రఘునాథపాలెం పంచాయతీలో సర్పంచ్ గుడిపూడి శారద, కార్యదర్శి పి.శ్రీనివాస్‌కుమార్ పంపిణీ చేయగా.. బిల్ కలెక్టర్ అంజయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ సూర్యం, గుడిపూడి రామారావు, ఎర్రగడ్డ లింగయ్య, కుర్రి పెద్ద మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే కోయచలక గ్రామ పంచాయతీలో సర్పంచ్ మాధంశెట్టి హరిప్రసాద్ పంపిణీ చేయగా.. ఉపసర్పంచ్ చెరుకూరి పూర్ణచందరరావు, చెరుకూరి భిక్షమయ్య, మాజీ ఉప సర్పంచ్ మద్దాల శ్రీను, కార్యదర్శి శృతి, మస్తాన్, మాచర్ల వెంకటేశ్వర్లు, మహిళలు పాల్గొన్నారు.

పొంగులేటి సేవా సమితి అన్నదానం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలో మున్నేరు వరద బాధితులకు గురువారం రాత్రి కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సేవా సమితి, పొంగులేటి యూత్ ఆధ్వర్యాన అన్నదానం ఏర్పాటుచేశారు. మోతీనగర్, కాల్వొడ్డు, బొక్కల గడ్డ తదితర ప్రాంతాల వరద బాధితులకు అన్నదానం చేయగా భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్యతో పాటు కొప్పెర ఉపేందర్, కల్లెం జాన్‌రెడ్డి, బాణాల లక్ష్మణ్, సాదె శంకర్, బెడదం సత్యనారాయణ, సముద్రాల శ్రీనివాస్, వీరేష్‌కుమార్, బానోత్ శంకర్ నాయక్, వనపర్తి విద్యాసాగర్, తేజావత్ శ్రీను, వంశీ, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితులకు అన్నదానం చేస్తున్న నాయకులు

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న మెడికల్ ఆఫీసర్

నేలకొండపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.శ్రావణ్‌కుమార్ సూచించారు. మండలంలోని నాచేపల్లిలో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణ పనులను గురువారం పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమతంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఆరోగ్య క్యాంపులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఐరిస్క్ గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆయిల్ బాల్స్ వేయటంతో పాటు డ్రైడే, ఫ్రైడే కార్యక్రమం క్రమంతప్పకుండా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వరద బీభత్సం..



రఘునాథపాలెం: మున్నేరు వరద నీటిలో మునిగిన కామంచికల్ శ్మశానవాటిక

గత కొన్ని రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగుతున్నాయి. లోలెవల్ చప్టాలపై వరద ప్రవాహం ఉధృతంగా ప్రవహించడంతో మారుమూల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమవ్వడంతో అధికారులు పోలీస్ పహారా నిర్వహించి రక్షణ చర్యలు చేపట్టారు. ముంపు ప్రాంతాల బాధితులను పునరావాసకేంద్రాలకు తరలించి వైద్య పరీక్షలు చేస్తున్నారు. పలు పార్టీలు, సంఘాల నాయకులు బాధితుల కోసం సహాయక చర్యలు చేపట్టగా.. మరికొందరు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టారు. కాగా మున్నేరు పరివాహక ప్రాంతాల్లో వేసిన పంట చేలు నీటమునిగాయి.

– సాక్షి నెట్‌వర్క్



నేలకొండపల్లి: సుర్దేపల్లి బ్రిడ్జి వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి



రఘునాథపాలెం: రాంక్యాతండా ముక్కుడుకుంట అలుగు వద్ద రోడ్డుకు అడ్డుగా పెట్టిన ట్రాక్టర్



నేలకొండపల్లి: సుర్దేపల్లిలో ట్రాక్టర్ కొట్టుకుపోయిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు



నేలకొండపల్లి: బైరవునిపల్లి చెరువు వద్ద చేపలు బయటకు వెళ్లకుండా చేస్తున్న మత్స్యకారులు



కూసుమంచి: రాజుపేట వద్ద వాగు వద్ద ప్రజాప్రతినిధుల సూచనలు



ఖమ్మం సహకారనగర్: సహాయక చర్యల్లో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు జావీద్ తదితరులు



తిరుమలాయపాలెం: కొక్కిరేణి చెరువు తూము తీస్తున్న ఇరిగేషన్ అధికారులు



తిరుమలాయపాలెం: నీటమునిగిన మిర్చి నారుమళ్లను చూపుతున్న రైతులు



రఘునాథపాలెం: వరద ప్రభావంలో కొట్టుకుపోయిన పాపటపల్లి పంచాయతీ ట్రాక్టర్



నేలకొండపల్లి: సుర్దేపల్లి కాలనీలో పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ దారా ప్రసాద్



నేలకొండపల్లి: చెరువుమాధారం రెగ్యులేటర్ వద్ద జాతరను తలపిస్తున్న చేపల వేట